సారా మామూలే

- దొరికేది కొంతే.. తయారీ ఎంతో!
- విచ్చలవిడిగా నాటుసారా తయారీ
- జోరుగా అక్రమ రవాణా, విక్రయాలు
- దాడులు చేస్తున్నా కానరాని ఫలితం

ప్రత్తిపాడు: నాటు సారా.. ఆరోగ్యాన్ని దెబ్బతీసే సారా.. ఓ పక్క అధికారులు దాడులు చేస్తున్నా, ఏదో మూల సారా ప్రవాహం ఏరులై పారుతోంది. పల్లెలు సారా వాసనతో గుప్పుమంటున్నాయి. ఈ మహమ్మారి పల్లె పల్లెనూ పట్టిపీడిస్తోంది. రోజూ ఎక్సైజ్ యంత్రాంగం దాడులు చేస్తూ వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేస్తోంది. నిందితులూ పట్టుబడుతున్నారు. అయినా కొండ ప్రాంతాలు, కాలువ గట్లు, ఏటిపట్టును పట్టుకుని సారా మరిగిపోతోంది. దాడులు చేస్తున్నా సారా రవాణా మాత్రం సాఫీగా సాగిపోతోంది. సామాన్యుల ప్రాణాలు హరిస్తున్న సారాను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని గ్రామాల్లో ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మెట్ట, ఏజెన్సీ గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు, రవాణా సాగిపోతోంది. మైదాన ప్రాంతాల్లోనే కాకుండా ఉప ప్రణాళికా ప్రాంతంలో సారా తయారీ యథేచ్ఛగా సాగిపోతోంది. కూలి పనులు చేసుకునే అనేక మంది సారా వ్యసనానికి బానిసలవుతున్నారు. పర్యావసానంగా అనారోగ్యం పాలవుతున్నారు. మరి కొందరు మృత్యువాత పడుతున్నారు. అధికారులు స్పందించి పల్లెల్లో నాటు సారాను పూర్తిగా అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధి ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, కిర్లంపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏలేరు ఎడమ, కుడి కాలువల వెంబడి అటు, ఇటూ 25 కిలోమీటర్లు నడిస్తే సారా గుప్పుమంటోంది. సర్కిల్ పరిధిలో మైదాన ప్రాంతాల్లోని చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, పెద్దిపాలెం, టి.రాయవరం, కృష్ణవరం, సిరిపురం, చిన్నింపేట, పేరవరం, అప్పనపాలెం, జడ్డంగి అన్నవరం, కొండ తిమ్మాపురం, వజ్రకూటం, మండపం, రాజవరం, సబ్ ప్లాన్ గ్రామాలైన పెదమల్లాపురం, తోటపల్లి, గొంది, మెట్టుచింత, గోకవరం, ఏటిపట్టు గ్రామాలు తామరాడ, ఎస్.తిమ్మాపురం, పాలెం, తదితర గ్రామాల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా విరాజిల్లుతోంది. గిరిజన తండాల్లో బహిరంగంగానే సారా విక్రయాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల గిరిజనులు చెబుతున్నారు.

వివిధ మార్గాల్లో రవాణా

నాటు సారా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ పరిధిలో తయారైన నాటు సారాను సుదూర ప్రాంతాలకు వివిధ మార్గాల్లో రవాణా అవుతోంది. పోలీసుల కంట పడకుండా దీనిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో తయారైన సారా కాకినాడ, తుని, పిఠాపురం తదితర ప్రాంతాలకు ఎక్కువగా తరలిస్తున్నారు. బైక్‌లు, ఆటోలు, స్కూటీ వంటి వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా తీసుకుపోతున్నారు.


టి.రాయవరంలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మూడేళ్లలో నమోదైన కేసులు, పట్టుబడిన నిందితులు

సంవత్సరం	నమోదైన కేసులు	అరెస్టయిన నిందితులు	స్వాధీనం చేసుకున్న సారా (లీటర్లు)	ధ్వంసం చేసిన ఊట (లీటర్లు)	పట్టుబడిన నల్లబెల్లం (కిలోలు)	పట్టుబడిన వాహనాలు
2022	1,105	856	11,741	1,49,140	22,500	29
2023	662	751	3,736	45,240	530	25
2024	329	314	5,439	96,600	---	16


కొండ తిమ్మాపురంలో సారా బట్టీ వద్ద పులిసిన బెల్లపు ఊట

ప్రజల సహకారం అవసరం



సారా తయారీని పూర్తిగా అరికట్టేందుకు ప్రజల సహకారం ఉంటేనే సాధ్యపడుతుంది. దాడులు, శిక్షలు, కేసుల కన్నా సామాజిక బాధ్యతకు కట్టుబడి ఉండాలి. సారా స్థావరాలుండే భూములకు చెందిన యజమానులూ ఈ అసాంఘిక చర్యలను వ్యతిరేకించాలి. సారా స్థావరాలపై దాడులు చేసి, తయారీకి పనికి వచ్చే బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్నాం. కేసుల నమోదు చేస్తున్నాం. సారా తయారీ, నిల్వలు, అక్రమ రవాణా, విక్రయాలు తదితర వివరాలను 94409 02470కు తెలపొచ్చు.

–పి.శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ, ప్రత్తిపాడు

క్లుప్తంగా

చిన్న వ్యాపారుల పాదయాత్ర

ఏలేశ్వరం: స్థానికంగా చిన్న వ్యాపారులంతా సోమవారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. గతంలో పట్టణంలోని దుకాణాలను తొలగించగా, వాటిని పునర్నిర్మిస్తే పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నట్టు వ్యాపారులు చెప్పారు. దుకాణాలను తిరిగి నిర్మించడంతో పాదయాత్ర చేశామన్నారు.

వెండి కలశం సమర్పణ


లోవ అధికారులకు వెండి కలశాన్ని అందిస్తున్న శ్రీసాయితేజ

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి అభిషేక సేవలకు వినియోగించాలని కోరుతూ తుని పట్టణానికి చెందిన భక్తుడు వెండి కలశాన్ని సమర్పించారు. సోమవారం లోవ దేవస్థానం సూపరింటెండెంట్ మూర్తి, ఏఈలు వీరభద్రరావు, శ్రీను, బాబూరావులకు భక్తుడు వియ్యపు నాగమణి కుమారుడు శ్రీసాయితేజ రూ.20 వేల విలువైన వెండి కలశాన్ని అందజేశారు. శ్రీసాయితేజకు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను బహూకరించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


తుని రాజా కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ రంగం యువజనోత్సవాల్లో భాగంగా సోమవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న వివిధ పాఠశాలలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం ఫైనల్స్ జరుగుతాయని ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. రోటరీ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, గౌరీశంకర్, గణేష్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్న లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు

ప్రత్తిపాడు: కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ఆదివారం జరిగిన 24వ రాష్ట్ర ఆహ్వాన కరాటే పోటీల్లో ప్రత్తిపాడు మండలం లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విజేతలకు నిర్వాహకులు బీకే రత్నం, వై.అంజనీకుమార్ షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. తమ కరాటే స్కూల్ నుంచి పోటీల్లో పాల్గొన్న 17 మందిలో ఏడుగురు ప్రథమ, పది మంది ద్వితీయ స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టార్ పి.బుజ్జి తెలిపారు. ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న వారిలో ఒమ్మంగి శ్రీభారతి స్కూల్‌కు చెందిన పావని, కార్తీక్, నవ్యశ్రీ, ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కి చెందిన వై.అమృత, ప్రత్తిపాడు అఖిల్ స్కూల్‌కి చెందిన ఎస్.నిషాంత్, గొల్లప్రోలు మండలం దుర్గాడ జడ్పీ హైస్కూల్‌కు చెందిన వినయ్, శ్రీవిశ్వభారతి స్కూల్‌కు చెందిన ఎ.వెంకట పవన్, జి.పవన్ ఉన్నారన్నారు. విజేతలను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఘనంగా సత్కరించాయి.

వీనుల విందుగా హరికథా గానం

అన్నవరం: రత్నగిరిపై రామారాయ కళావేదికపై అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన హరికథా భాగవతారిణి టి.తులసీ శ్రీనివాస కల్యాణం హరికథను సోమవారం వీనుల విందుగా గానం చేశారు. ఆమె హరికథా గానానికి భక్తులు ముగ్ధులయ్యారు. గతంలో హరికథా గానంలో లిమ్కా బుక్ ఆఫ్ అవార్డు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ గానానికి వయోలిన్‌పై ఈశ్వరమ్మ, మృదంగంపై మోహనరావు సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం ఆమెను దేవస్థానం తరఫున సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఘనంగా సత్కరించారు.

నేడు మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

దూసుకెళ్లిన లారీ

గండేపల్లి: జాతీయ రహదారి బ్రిడ్జిపై ఓ లారీ డివైడర్ గ్రిల్స్‌పైకి దూసుకుపోయింది. రాజమహేంద్రవరం వైపు నుంచి సిమెంట్ లోడుతో లారీ ప్రత్తిపాడు వెళుతుండగా నీలాద్రిరావుపేట పరిధి కార్తికేయ ఆసుపత్రి ఎదురుగా వచ్చే సరికి లారీ డివైడర్ గ్రిల్స్‌పైకి దూసుకుపోయింది.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


బూరుగుపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరి

కిర్లంపూడి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం ఎస్‌డీపీఓ శ్రీహరి అన్నారు. బూరుగుపూడి ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానంతో పాటు సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై వీడియోలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మి వ్యక్తిగత వివరాలు ఎవరితో పంచుకోవద్దని అన్నారు. సామాజిక మాధ్యమాల్లోని ప్రకటనలు చూసి ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకోవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధనలు


ధర్మవరంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా కార్తిక వన సమారాధనలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ధర్మవరంలోని కోల్డ్ స్టోరేజ్ వద్ద మామిడి తోటలో కాపు వన సమారాధన జరిగింది. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులు, మహిళలు ఉల్లాసంగా గడిపారు. ధర్మవరం గ్రామంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రత్తిపాడు రూరల్: శంఖవరం, కత్తిపూడి, వేళంగి, మండపం తదితర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు తరలివెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో వన సమారాధన జరిగింది.

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామ శివారున సోమవారం కార్తిక వన సమారాధన జరిగింది. గ్రామానికి చెందిన సిద్ధా చంటి, కామరాజు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రత్తిపాడు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు. సీఐ బి.సూర్య అప్పారావు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు సర్కిల్‌లోని ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది వాహన తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి జరిమానా విధించారు.

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జగ్గంపేట పోలీస్ సర్కిల్‌లో 12 మంది పట్టుబడగా, వారిని సోమవారం కోర్టులో హాజరు పరిచామని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. 8 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, 7, 2, 3 రోజుల చొప్పున నలుగురికి జైలు శిక్ష విధించారన్నారు.

అధికారుల డుమ్మా

గండేపల్లి: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఏఓ సద్గురుమూర్తి, ఎంఈఓ రెడ్డి, ఏపీఓ గంగాభవాని, పశువైద్యాధికారి సుప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, ఏపీఎం సన్యాసిరావు, పీహెచ్‌సీ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు రాకపోవడంపై సర్వత్రా ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు


కిర్లంపూడిలో పద్మనాభం, గిరిబాబును కలసిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, యువ నాయకుడు గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో ఏఎంసీ డైరెక్టర్ విజయ్‌కుమార్, తూర్పులక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, నాయకులు కొరడా ప్రసాద్, పతివాడ జగదీష్, కావలి శ్రీనువాస్, గాది ఐరాజులు కిర్లంపూడిలో ముద్రగడను ఆయన నివాసంలో కలిశారు. ప్రత్తిపాడు నియోజకర్గంలోని ప్రజలకు ముద్రగడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


ఆట్యా పాట్యా జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

తుని: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆట్యా పాట్యా జిల్లా అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి ఆట్యా పాట్యా అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్ల ఎంపిక జరిగింది. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. జిల్లా కార్యదర్శి పి.ప్రశాంత్‌కుమార్, జి.విక్టర్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.నరసింహమూర్తి, శివ రామకృష్ణ, పాపారావు, శ్రీను, కె.లక్ష్మి, వరలక్ష్మి, పరదేశమ్మ, కళ్యాణి, లోవ లక్ష్మి, శ్రీలక్ష్మి, ఆశ ఎంపిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పురుషుల జట్టుకు ఆర్‌వీవీ రామకృష్ణ (సిరిపురం), జి.హేమసతీష్ (తుని), పి.అశోక్‌వర్ధన్, ఆర్.ఆనంద్‌కుమార్, కె.వంశీకుమార్, కె.మురళి, పి.లోవప్రసాద్ (ఎస్.అన్నవరం), పి.అచ్యుత్ (బొద్దవరం), సీహెచ్ రోహిత్ (అన్నవరం), ఎ.శ్యాంశివ, ఎం.రాహుల్ (తుని) ఎంపికయ్యారు. బాలికల జట్టుకు గంగాలక్ష్మి, ఆర్.జయ(సీతారాంపురం), బి.సిరి (కేజీబీవీ), యు.శివగంగ రాజేశ్వరి (హంసవరం), కె.శ్రీలక్ష్మిపూజ, ఎన్.శరణ్య, సీహెచ్ ఉమా శైలేంద్రి, పి.శైలజ (జగన్నాథగిరి), వి.అపర్ణ (రావికంపాడు), ఎస్.అనిత, బి.దుర్గారాజేశ్వరి, డి.దుర్గాసౌజన్య (హంసవరం) ఎంపికయ్యారు.

సీఎం సహాయ నిధికి విరాళం

అన్నవరం: స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.పది వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు డీడీని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్‌కు సోమవారం అందించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


ప్రత్తిపాడు కోర్టులో న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: న్యాయవాదులు, న్యాయ కళాశాల విద్యార్థినులపై జరిగిన దాడులను నిరసిస్తూ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. ఇటీవల విశాఖ న్యాయ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం, తమిళనాడు రాష్ట్రంలో నడిరోడ్డుపై న్యాయవాదిని కిరాతకంగా హత్య చేసిన సంఘటనలకు నిరసనగా న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేశారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని న్యాయమూర్తి కాటం భానుకు అందజేశారు. ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ ప్రతినిధులు రవణం వీరవెంకట్రావు, పలివెల నాగేంద్ర రాజు, జొన్నాడ రాజేష్, లింగంపల్లి శివకుమార్, కుక్కుటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విద్యుత్‌కు బిల్లులు ఏంటి!


విద్యుత్ శాఖ డీఈ వీరభద్రరావుకు వినతి పత్రం అందిస్తున్న దళిత నేతలు

జగ్గంపేట: గత ప్రభుత్వం దళితులకు రాయితీపై విద్యుత్ అందిస్తే, వాటికి కూటమి ప్రభుత్వం బిల్లులు వేసి పంపుతోందని, దీనిని తక్షణం ఆపాలని జగ్గంపేటకు చెందిన దళిత నేతలు డిమాండ్ చేశారు. సోమవారం జగ్గంపేట విద్యుత్ శాఖ డీఈ వీరభద్రరావును దళిత నేతలు కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత నేత, బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు. ఆ పైగా వచ్చిన యూనిట్లకు బిల్లు కట్టించుకునే వారని తెలిపారు. ఇప్పుడు గతంలో వాడిన రాయితీ యూనిట్లకు బిల్లులు వేసి పంపుతున్నారని అన్నారు. ఒక్కొక్కరికి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకూ బిల్లులు వస్తున్నాయన్నారు. వేల రూపాయిల బిల్లులను రెండు లేక మూడు వాయిదాల్లో చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కూలీ నాలి చేసుకునే దళితులు రూ.వేల బిల్లులు ఎలా చెల్లిస్తారని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌కు కూటమి ప్రభుత్వం బిల్లులు పంపించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి వల్లూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

- జగ్గంపేట విద్యుత్ డివిజన్ పరిధిలో ఎస్సీ వినియోగదారులు 2,469 మంది నుంచి రూ.3.79 కోట్ల బకాయిలు వసూలు చేయాలని జగ్గంపేట డీఈ వీరభద్రరావు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఆదేశాల మేరకు మొండి బకాయిలు వసూలు ప్రారంభించామన్నారు. ఎంతో కాలంగా రూ.5 వేలు పైబడిన బకాయిలు చాలా ఉన్నాయని తెలిపారు.

డిగ్రీ కళాశాలతో ఒప్పందం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో టెడ్ లాన్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ సోమవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనికి సంబంధించి ఒప్పంద పత్రాలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు, టెడ్ లాన్స్ సంస్థ సీఈఓ రామదేవు రామ్‌కుమార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ పైథాన్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అంశాలపై ఇంటర్నషిప్ అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు. ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ వారణాసి మల్లికార్జున శర్మ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ విశ్వేశ్వర్, ఝాన్సీదేవి, దేవీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

గోకవరం: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా మంగళవారం దేశ వ్యాప్తంగా జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘాల నాయకులు సోమవారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘ నాయకుడు వి.జోగారావు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు, కార్మిక వర్గం, వృత్తి సంఘాలు, ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అన్ని జిల్లా కేంద్రాల్లో దేశ వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తామన్నారు.

మహిళా రక్షణపై అవగాహన

గండేపల్లి: మల్లేపల్లి జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో విద్యార్థినులకు మహిళా రక్షణపై ఎస్సై యూవీ శివనాగబాబు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలను నమ్మి మోసపోవద్దని వివరించారు.

హరహర... శుభకర

- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు
- ఆఖరి కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

తుని రూరల్/ ఏలేశ్వరం/ కోటనందూరు/ కిర్లంపూడి/ తుని/ జగ్గంపేట/ తొండంగి: హరహర.. శుభకరా అంటూ ఆ సర్వేశ్వరుడిని భక్తజనం కొలిచింది. కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. తిమ్మాపురంలో అర్చకులు, ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులు నదీ జలాలతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం కుంభాభిషేకం చేశారు. తేటగుంట శివాలయంలో సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టి.తిమ్మాపురం, తేటగుంట, హంసవరం, చామవరం, చేపూరు శివాలయాల్లో అన్న సమారాధనలు జరిగాయి. ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం వేంకటేశ్వరస్వామి ఆలయాలు, డి.పోలవరంలో రామాలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాల్లో ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. కోటనందూరు మండలం బొద్దవరంలో గౌరీ కాశీజ్ఞానేశ్వరస్వామి, కోటనందూరులో సర్వమంగళాంబ భోగలింగేశ్వరస్వామి, అల్లిపూడి ఉమామహేశ్వర ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు ప్రారంభించారు. బొద్దవరంలో 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఇక్కడి శివాలయంలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కిర్లంపూడి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద, ఏనుగువీధిలో అన్న సమారాధనలు జరిగాయి. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నూకాలమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు దర్శించుకున్నారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తుని పట్టణంలోని కన్ట్రాళ్లకొండ, పెద్దవీధి, గవరపేట శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కన్ట్రాళ్లకొండ తాండవ రామలింగేశ్వర ఆలయంలో అన్నదానం నిర్వహించారు. జగ్గంపేటలో ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. తొండంగి మండలం ఒంటిమామిడి విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వర ఆలయం, బెండపూడి విశ్వేశ్వరాలయం, గోపాలపట్నం ఉమా రామలింగేశ్వరాలయం, పైడికొండ, ఎ.కొత్తపల్లి, పీఈ చిన్నాయపాలెం, అద్దరిపేట, పంపాదిపేట, శృంగవృక్షం శివాలయాల్లో కూడా భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలు, పూజలు నిర్వహించారు.


టి.తిమ్మాపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

గోకవరం: గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. రమా సత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొత్తపల్లిలో బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి వారి ఆలయంలో పూజలు జరిగాయి.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించారు.


కిర్లంపూడిలో నూకాలమ్మను దర్శించుకుంటున్న యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు


ఏలేశ్వరం శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


బొద్దవరం శివాలయంలో చిన్నారుల కోలాటం


గోకవరంలో పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం

ఏపీయూఎస్ సంఘ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ప్రత్తిపాడు మండల శాఖ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం ఏపీయూఎస్ మండల సమావేశం జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ చలపతి హాజరయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్.గణపతిరావు, ఉపాధ్యక్షుడిగా ఎన్.సత్తిబాబు, కోశాధికారిగా ఆర్‌వీవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ఎన్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అప్పారావు పాల్గొన్నారు.